# కాష్టం

పులిపాటి గురుస్వామి

**అసహన జీవితం**
**ఎక్కడి నుంచీ పరిమళం లేదు**
**అంతా గొడవే. గొడవ పంచాయితీ, గొడవ-విడాకులు, గొడవ-యుద్ధము, గొడవ-సరిహద్దులు, గొడవ-రూపాయి.**

శ్వాసకూడా సందిగ్ధంపాలై ఒక్కోసారి ఆగి మళ్లీ సాగుతుంది.

జ్ఞాపకాల్లో గొడవే.

అసంతృప్తి పెద్ద గొడవ.

చదువు కాలంనుంచీ అదే వెంట. బాల్యము, యవ్వనము అంతటా అసంతృప్తే. చివరికి పెళ్లికూడా. పెళ్లి కాదేమో పెళ్లాం అనాలి కావచ్చు. కొన్ని సార్లు నిద్ర కూడా అసంతృప్తిని కావలించుకొని జాగారం చేస్తుంది. తెల్లారితే రకరకాల మారుపేర్లతో మళ్లీ అదే.

పిల్లలు గొడవ బాగా చేస్తున్నారు. ఎంత గదమాయించినా కొంతసేపే నిశ్శబ్దం. మళ్లీ అల్లరి మామూలే. ఇది అసంతృప్తి గొడవ కాకపోవచ్చు.

అసలీ పిల్లలకి అసంతృప్తులుంటాయా? ఏవో వుంటాయి వాళ్ల తరహాలో. ఎప్పుడైనా అడిగి తెలుసుకోవాలి.

దాహమేస్తుంది.

స్కూల్లో నీళ్లు తాగాలంటే భయమేస్తుంది.

బూజుపట్టిన ఓ మూల పాతకాలం నాటి కుండ. బహుశా స్కూలు ప్రారంభమైన రోజు కొని వుంటారు. కింద కాసింత ఇసుకపోసి దాన్ని జాగ్రత్తగా కూచోబెట్టారు. దాని మీద ఎన్నడూ కడగని ఓ కంచుడు (మూత).

జీవితంలో లానే మురికి, మట్టి, మడ్డి అడుగున. ఒసారి చూడాలనిపించి, ఎవరూలేనప్పుడు చేయితో అడుగు తాకిచూశాను. జిగట జిగట-జారులా పుస్సునజారింది. గీకి చూశాను- గోళ్లు నిండిపోయాయి. అప్పటినుండి అందులోని నీళ్లు తాగటం మానేశాను.


చప్రాసి (అటెండర్)తో ఒకసారి కుండ గురించి -'రోజూ మంచిగా కడిగి పెట్టొచ్చు కదా'! అన్నాను

"ఇంత వరకెవరన్లే సార్. మీరే ఇట్ల చెప్తున్నరు. రోజూ కడగందే నీళ్ల నింపుతాం సార్" అని జవాబు-విరుచుకు పడ్డట్టు. మందలించడం మన పని కాదుగా అనుకుని వదిలేశాను.

అవసరమైతే హోటల్ నీళ్లు-

చేతులు కుట్టిన నీళ్లే అవి కూడా- తప్పదు మరి.

ఈ ఆడ టీచర్లు బ్యాగుల్లో తమ నీళ్ల సీసాలు తెచ్చుకుంటారు కానీ- అడగాలనిపించదు. చాలా గమ్మత్తుగా తాగటం జరుగుతుంది.



దాహమనిపించగానే గుటికెడు తాగటం-సీసాలో ఎన్ని తగ్గాయో చూసుకొని మూత బిగించటం-మళ్లీ క్లాసుకెళ్లి రాగానే మరోసారి నాలుక నుండి గొంతులోకి జారేటన్ని తాగి, మళ్లీ సీసాలో ఎన్ని తగ్గాయో చూసుకోవటం-మధ్యాహ్నం తిన్నాక కూడా జాగ్రత్తగా తాగటం-మనసునిండా నీళ్లు అయిపోవద్దని-గిచ్చి గిచ్చి తాగి -ఆ సాయంత్రానికి కొన్ని మిగిలించుకొని-'హమ్మయ్య' అనుకొని- స్కూలువదలగానే ఆ మిగిలినవి కూడా తాగి లేదా ఇష్టం లేకపోతే పారబోసి చక్కాపోతారు.

బాగా దాహమేస్తే చాలనన్ని నీళ్లుంటాయి ఆ సీసాల్లో, పొట్టి పొట్టి, బక్కటి, మిస్ సీసాలు కూడా వచ్చాయి ఈ మధ్య. మహా అయితే 800 మి.లీ. నీళ్లు వుంటాయి కావచ్చు. ఇంకా తక్కువే. నాలాంటి వాడు ఒకసారికో రెండుసార్లకో పీల్చి పడేస్తే-పాపం వాళ్ల "నోటి దాహం"తో మన పని అంతే ఇక ఆ రోజుకి.

'సార్ వీడు తంతున్నాడు సార్' ఒక పిల్లాడు

'సార్ వీడు ఉమ్మేసిండు సార్' ఇంకొకడు

పిల్లలు కొట్టుకుంటున్నారు. అల్లరి చేస్తున్నారు. ఎంత చేసినా మళ్లీ పొద్దున్నే అవన్నీ మర్చిపోయి కలిసుంటారు. లేదా మళ్లీ కలిసి కొట్టుకుంటారు. ఎటొచ్చీ జీవితంలోనే భార్యాభర్తల మధ్యన సంవత్సరాల తరబడి ఒకే గొడవ జరుగుతూ వుంటుంది.

జ్ఞాపకం చేసుకొని, కెల్లగిచ్చుకొని, గిచ్చుకొని, గింజుకొని అదే విషయాన్ని మళ్లీ మళ్లీ కలబెడుతుంటారు.

"ఏయ్ గొడవ పడకండి రా! సైలెన్స్"

అప్పుడప్పుడు ఇట్లా అరవాలి. క్లాసులో పంతులున్నట్టు లెఖ్క. అవతలి పంతుళ్లకి వినిపించాలి. బెత్తంతో గోడను కొట్టాలి. అలా గాల్లోకి చూస్తూనో లేదా బయట కిటికీలోంచి వెళ్లే అమ్మాయిని చూస్తూనో 'రేయ్ ఎవ్రరా అక్కడ గొడవ చేసేది' అంటూ అరవాలి. ఆ పోయే వాళ్లు ఒకసారి లోపలికి చూస్తే హాయిగుంటుంది.

ఎన్నితిప్పలో

పక్క క్లాసులో హెడ్మాష్టరుంటే ఇంకాస్త మన గొంతుకు సౌండు పెంచుకోవాలి.

ఈ రోజు అరవటానికి కూడా ఓపిక లేదు. పొద్దున తిట్లు తప్ప టిఫిన్ పెట్టలేదు శ్రీమతి.

"కూడు నిరాకరణోద్యమం" సాగిస్తుంది. నా బాధ ఆమె అర్థం చేసుకోదు. ఆమె విన్నపాన్ని నేను మన్నించను. ఫైటింగ్ రడీ. డైలాగ్స్, యాక్షన్ అన్నీ ఒకేసారి.

నగరజీవితం ఆమెకిష్టం. మనుషుల్లాంటి మనుషుల మధ్య నాకది రుచించదు.

నగరానికి ముప్పై కి.మీ. దూరంలో సబర్బన్ టౌన్లో వుండి-నేనే ఈ ఉద్యోగ స్థలానికి రాకపోక సాగిస్తూ వుంటిని. ఆమెకైతే ఏ కష్టమూ లేదుగా. అహ- అలా అంటే వినదు.

'ఇది ఊరు' అంటుంది. ఇక్కడ బతకడం తనకు నచ్చదని -నెత్తినోరు కొట్టుకొని -ఇద్దరమూ కొట్టుకున్న రోజులు కూడా వున్నాయి.

ఇంటి కిరాయి, కరెంటు, నల్లాబిల్లులు, ఆడంబరాల కోసం ఆర్భాటాలు, వీటన్నిటితో పాటు పిల్లాడి కాన్వెంటు చదువు- తడిసిమోపెడౌతుందని ఎంత సముదాయించినా వినదు.

నన్నో అసమర్థునిలా, 'దమ్ములేవని'- పెళ్లాం పిల్లలకింత కూడపెట్టటమొక్కటే సరిపోదనీ- ఏదీ అనుభవించని బతుకోబతుకా? అని- రకరకాల వ్యంగ్యాలు, తిట్లు, గొణుక్కోవటాలు, చిరాకులు- గ్లాసులు ఎత్తేయటం, వస్తువులు విసిరేయటం- అప్పటికి నాకు ఓపికపోతుంది. ఇక నోరు మెదిపానో విరుచుకుపడుతుంది.

ఇట్లాంటి సంసారంలో పడ్డానని -దిగులుతో -వాళ్ల పెద్దవాళ్లని, పెళ్లి సంబంధం తెచ్చినవాణ్ణి తిట్టిపోస్తుంది - ఇట్లా జరుగుతుందని కలలో కూడా అనుకోలేదని నిరుత్సాహపడుతుంది.

మాటా మాటా వస్తే- 'అసలు నా కోసం నువ్వేం చేశావ్'? 'ఒక్కటి ఇది చేశానని చెప్పు' అంటూ నిలదీస్తుంది.

ఏం చేయాలో తోచదు. చేయటమంటే ఆమె అర్థంలో ఏమిటో? ఓ తాజ్‌మహల్ కట్టివ్వడమా? లేదా ప్రపంచ యాత్రల్లో విహరించటమా?-ఇవి సాధ్యమా!

మనమెంత, మన ఆదాయమెంత, మనమెలా బతకాలనే ఇంగిత జ్ఞానం కూడా లేకుండా-గొడవ గొడవ -రోజూ ఏదో ఒక మిషమీద పట్నంలోకి కుటుంబం మార్చటం మీదికే వస్తుంది గొడవ.

పిల్లాడు బెదిరిపోయి చూస్తూవుంటాడు. ఒక్కోసారి-ఒక్కోసారేంటి చాలాసార్లు నేనే ఊరుకుంటాను. అలా కూడా ఊరుకోదు-'దున్నపోతు మీద వాన' అంటూ తన నోటి దురదనంతా గోక్కుంటుంది.

సినిమాలు, స్టార్‌టీవీలు, కొత్త కొత్త పోకడలు-హైటెక్ జీవన విధానాలు- దినసరి జీవితాల్లోకి అనవసరంగా చొచ్చుకొచ్చిన అనేక అవసరాలు-వాటి పట్ల మోజు-వ్యామోహం-పట్నం వైపుకు వలస.

సబర్బన్ టౌన్‌లోనే మా పిల్లాడి రెండో తరగతి ఖర్చుకి నెలకు ఆరొందలు రూపాయలు ట్యూషన్‌తో కలిసి. ఇక నగరంలో తట్టుకోగలమా అనేది నా బాధ.


సంపాదనెంత, ఖర్చెంత- కొంతదేనికైనా దాచుకుందామని గానీ, పిల్లలకోసం కూడ బెట్టుకుందామని గాని ఉండదు. ఎంజాయ్ చేయాలంటుంది.

ఎంజాయ్ చేయడానికి కావలసిన వస్తువులేంటి? పేర్కొని అవసరమైనచో పటములు గీయుము?-అని పిల్లల ప్రశ్నపత్రాల్లో అడిగితే ఏం రాస్తారో?

ఈ పిల్లలు పెద్దాళ్లయేసరికి ఇంకా ఎన్ని మార్పులొస్తాయో 'హైటెక్ మార్పులు'.

అసలీపిల్లలు పెద్దయ్యాక ఏమౌతామనుకుంటారో? మనం మీలో గాంధీలున్నారు. నెహ్రూలున్నారు అని తృప్తిపడి- లేదా రెచ్చగొడుతూవుంటాం కానీ-వాడు ఏది కావాలనుకోవటం వాడి చేతుల్లో వుంటుందా?

ఒసారి అడిగి చూస్తా. అసలీ పిల్లలేమంటారో? నిజానికి ఈ గవర్నమెంటు ప్రైమరీ స్కూల్లో ఒక్క గవర్నమెంటు వుద్యోగి పిల్లవాడూ లేదు. అంత దాకా ఎందుకు - నేను కూడా కాన్వెంటులో కదా చేర్పాను ఆ చిన్న టౌన్‌లో కూడా. ఈ పిల్లల్ని భావి భారత పౌరులుగా తీర్చిదిద్




స్వాతంత్ర్య దినోత్సవాల్లోని వాగ్దానాలు, ఉపన్యాసాలు సిగ్గుతో బూజుపట్టి పోతూనే వుంటాయి.

పిల్లలు సరైన బట్టలు కూడా లేకుండా, పుస్తకాలు లేకుండా -ఏదో మొక్కుబడిగా-బియ్యమైనా వస్తాయని స్కూలుకు పంపుతున్నారు తల్లిదండ్రులు. విద్య అభివృద్ధి ఎక్కడ జరుగుతుందో ఏ పైవాడికీ తెలియదు. అంతా కాలక్షేపపు యాతన.

ఇంకా క్లాస్ సమయం పూర్తికాదే-కడుపులో వెలితి, మనసులో వెలితి, సంసారంలో వెలితి, బతుకులో వెలితి, వెలితి....వెలితి.

'సార్ వీడుపలకతో కొడుతున్నాడు సార్' ఒకడు

'ష్' సైలెన్స్ -పిల్లలూ మీరు కొట్టుకోవాల్సిన రోజులు, దెబ్బలు తినాల్సిన రోజులు ముందున్నాయిరా- ఇప్పుడు మనం కొన్ని ముఖ్య విషయాలు మాట్లాడుకుందాం సరేనా?

'సరే' -పిల్లలందరూ.

'నేనొక ప్రశ్నవేస్తాను మీరంతా దానికి కరెక్టుగా సమాధానం చెప్పాలి సరేనా?'

'సరే'

రమేష్ నువు చెప్పు ముందు 'పెద్దయ్యాక నువ్వేం చేయాలనుకుంటున్నావు'?

కాసేపు ఆలోచించాడు. మళ్లీ నేనే- 'మీరు పెద్ద చదువులు చదువుకొని ఏం చేయాలనుకుంటున్నారో చెప్పాలి' -అన్నాను.

'ఆటో నడిపిస్త సార్' అన్నాడు రమేష్

'అదేంట్రా అదేంకోరికరా'!-

నిరుత్సాహంతో -కాసేపు నాకేం తోచలేదు. ఈ పిల్లల్లో కాస్త శ్రద్ధతో చదివే ఒక్కడూ ఆటో నడిపించడానికి సిద్ధమైపోయాడు.

వాడు నేనేమంటానో అన్నట్లు తలవంచుకున్నాడు.

'ఎందుకట్లా అనుకుంటున్నావు చెప్పు'

' మా అయ్య రిక్షాతొక్కితే వచ్చే పైసలకంటే ఆటో ఐతే ఎక్కువస్తయి సార్'

ఓహో ఇదన్న మాట సూత్రం-గాంధీలుగా, నేతాజీలుగా తీర్చే పరిస్థితులేం లేవుగా మనకి-సరే

'సాయి నువ్వేమవుతావురా?'

'నేను లారీ నడిపిస్తా సార్' చాలా ధీమాగా చెప్పాడు లేచి.

'మీ నాన్నేం చేస్తాడ్రా'? అన్నాను

'మా డాడీ ఆటో నడిపిస్తాడు సార్'

'సాయిరాం నువ్వేం చేస్తావురా?'

'స్కూటర్లు బాగ చేస్త సార్'

'ఆరిఫ్ నువ్వు?'

'కార్లు బాగ చెస్త -మా భాయ్‌బీ అదే చేస్తుండు సార్'

ఈ పిల్లలు ఇంతకంటే ఎక్కువగా ఇక ఏం ఊహించగలరు తామున్న స్థితికంటే ఇంకొంచెం మెరుగైన దాని మీద మాత్రమే వారి దృష్టి వున్నట్టుంది. సరే అలా అవుతారా లేదా అనేది పక్కకు పెడితే ఇప్పటి ఆలోచనలైతే ఇంతకు మించి లేవనిపిస్తుంది.

పిల్లలు గుసగుసల్లో పడ్డారు. ఏం చెప్పాలా అని చర్చించుకుంటున్నారు.

ఇంట్రెస్టుగానే వుంది వాళ్లకి.

'జ్యోతి నువు చెప్పమ్మా ఏమవుతావు?'

'అమ్మనవుతా సార్'

అందరూ నవ్వారు. నాకూ ఆగలేదు

ఎలాగూ అమ్మ అవ్వాల్సిందే కదా! రుద్రమదేవిగానో, ఝాన్సీలక్ష్మిగానో అవ్వాల్సిన అవసరంగానీ, అంతశ్రమగానీ అవసరం లేదు కాబోలు.

వాళ్లమ్మలా తనూ 'అమ్మ'యి పోదామనుకుంటుంది. తనకు తెలిసిన ప్రపంచంలోకే తాను.

'అనురాధా నువ్వమ్మా?'

లేచి నిలబడింది, ఏం చెప్పుందోనని అందరూ ఎదురు చూస్తున్నారు.


సిగ్గుపడుతుంది.

'చెప్పమ్మా-నువ్వేం కావాలనుకుంటున్నావు పెద్దయ్యాక'.

చటుక్కున -'సౌందర్యనవుతా సార్' అని కూచుంది.

పిల్లలందరూ నవ్వారు. ఆ అవస్థ నుండి నే ఇంకా

ఎన్నిరకాల కులవృత్తులున్నాయో-అసలు వాళ్ల వాళ్ల కులవృత్తులేమిటో ఈ పిల్లలకి తెలియవు. స్కూల్లోగాని, ఇంట్లోగాని వాటి గురించి తెలిపే సందర్భాలు కూడా పోయాయి. బతకడానికి ఎన్ని మార్గాలున్నాయో కూడా వారికి తెలియదు. ఈ చదువు అన్నం పెడుతుందని, ఉద్యోగాలిస్తుందని కూడా ఈ పిల్లల్లో ఉన్నట్టు కన్పించలేదు.



తేరుకోక ముందే -అడగకముందే 'శివ' అనే పిల్లాడు లేచి-'నేను వెంకటేష్ నవుతా సార్' అన్నాడు.

పిల్లలు మళ్లీ నవ్వారు

ఇంకో పిల్లాడు నేను 'మోహన్ బాబునౌతా' అన్నాడు. వాళ్ల ఊహలు దారిమళ్లాయి. మరో పిల్లాడు 'సచిన్ టెండూల్కరౌతానన్నాడు'. ఆ దశకి వెళ్లటానికి ఎంతకష్టమో వాడికి తెలియదు.

ఒక్క పిల్లాడు మాత్రం డాక్టరవుతానన్నాడు. మిగతా అందరూ చిన్నచిన్న పనులు హోటల్ నడుపుతానని, కొట్టుపెడతానని, ఫోన్ డబ్బా పెట్టుకుంటానని చెప్పారు. చాలామంది సిన్మా యాక్టర్ల పేర్లు చెప్పారు.

ఎన్నిరకాల కులవృత్తులున్నాయో-అసలు వాళ్ల వాళ్ల కులవృత్తులేమిటో ఈ పిల్లలకి తెలియవు. స్కూల్లోగాని, ఇంట్లోగాని వాటి గురించి తెలిపే సందర్భాలు కూడా పోయాయి.

బతకడానికి ఎన్ని మార్గాలున్నాయో కూడా వారికి తెలియదు. ఈ చదువు అన్నం పెడుతుందని, ఉద్యోగాలిస్తుందని కూడా ఈ పిల్లల్లో ఉన్నట్టు కన్పించలేదు.

గవర్నమెంటు ఉద్యోగాలు చేసే మధ్యతరగతి, ఉన్నత మధ్యతరగతి, పై తరగతుల కుటుంబాల పిల్లలకి ఆ వివరాల పట్ల మక్కువ. డాక్టర్లు, ఇంజనీర్లు, కలెక్టర్లు, కంప్యూటర్లు ఇంకా రకరకాల ఉన్నత విద్యలు, ఉద్యోగాల గురించి- పాపం గవర్నమెంటు ప్రైమరీ స్కూల్లో చదివే ఈ పిల్లలకి ఎలా తెలిసేది- కనీసం తమ కులవృత్తులు ఏమిటో కూడా తెలియదంటే మిగతావాటి గురించెలా తెలుస్తుంది.

చదువు ఈ పిల్లల్లో ఏం మార్పుల్ని తెస్తుందో! వయసు, పరిణతి చెందే మెదడును వదిలి, వాళ్లు పెద్దయ్యే కొద్దీ తెలుసుకునే విషయాలన్నీ చదువుల వల్లే తెలుస్తాయనే భ్రమలో మనం చదువు చదువండని పిల్లల్ని మభ్యపెట్టడమో, బలవంత పెట్టడమో చేస్తూవున్నాం.

స్కూల్ గంట మోగింది.

హమ్మయ్య ఈ రోజుకి ఈ పిల్లలు జైలునుండి బయల్దేరవచ్చు- నేను మాత్రం మరో జైల్లోకి ప్రయాణం-

వివరీతమైన రద్దీతో- సబర్బన్ బస్సులు కూడా- ప్రయాణమెప్పుడూ భయమే-

నా శ్రీమతి పక్కింటావిడతో మీటింగునాపి వచ్చింది. నా అలికిడి వినగానే. నేను ముఖం కడుక్కుని వచ్చేసరికి పిల్లాడింకా రాకపోయేసరికి-ఎక్కడికెళ్లాడని అడిగాను.

'నాకేం చెప్పి వెళ్తాడా నీ కొడుకు'

ఎంత వెటకారమో! ఇంట్లోకి రాగానే నేనడిగిన మొదటి మాటే కదా! ఇలాగే వుంటుంది సంభాషణ.

సంసారంలో దుఃఖం తప్ప మరోటి లేదు. కళ్లల్లోకి చూసుకుంటూ ఆహ్లాదంగా కాకపోయినా ఆప్యాయంగానయినా మాట్లాడుకుంటే ఎంత బావుండుననిపిస్తుంది.

కనీసం దగ్గరకొచ్చి 'అలసిపోయినట్టున్నారే' అని ఒక పరామర్శ వాక్యం-బతుకు మీద ఎంత ప్రేమను కల్గిస్తుంది. ఆ మనిషి మీద ఎంత అనురాగం కల్గిస్తుంది.

'ప్చ్... ఇవేవీ లేవు. తగువే. మాట తగువే. చూపు తగువే. పిలవకున్నా గొంతు ముంగిట చేరేది దుఃఖమే, ఎంత దిగమింగుకున్నా పొగిలి పొగిలి పొర్లుతూవుంది.

పిల్లాడు పెద్దగా అల్లరి చేసుకుంటూ వచ్చాడు. చేతిలో బ్యాట్, ఆడిఆడి కాళ్లు చేతులు దుమ్ముతో నిండి వున్నాయి.

'ఏంటి నాన్నా ఆ మట్టి, దుమ్ము కడుక్కో పో- హోంవర్కు చేసుకోవా?' అన్నాను

'అప్పుడే చేసుకున్నా' అన్నాడు నిర్లక్ష్యంగా. ఇందాక స్కూల్లో జరిగిన చర్చ మనసులోంచి వెళ్లలేదు. వీన్ని అడిగి చూస్తే వీడేం చెప్తాడో తెలుసుకోవాలన్పించింది.

'చాపత్త నిండుకుంది పంతులు గారూ'

టీ పెడుతూ రేపటి మొదటి ఆర్డర్ జారీ చేసింది శ్రీమతి వ్యంగ్యంగా.

అయిపోయిన వస్తువుల్నయితే కొనుక్కోవచ్చు. కానీ అంతరించిపోయిన ప్రేమల్ని ఎలా పొందాలి?

, సామాజికపరమైన అనేక మార్పులు, జీవన విధానాలు ప్రేమల్ని అణగదొక్కుతున్న విషయాల్ని తెలిపేదెట్లా?

పిల్లాడు కాళ్లు చేతులు కడుక్కొని తుడుచుకుంటూ వుండగా మా ఆవిడ టీ తెచ్చింది. ఆమె సమక్షంలోనే నేను సరదాగా 'నానీ-నువు పెద్దయ్యాక ఏమవ్వాలనుకుంటున్నావురా? అంటే ఎలాంటి చదువు చదివి ఎలాంటి ఉద్యోగాలు చేయాలనుకుంటున్నావు?' అన్నాను, కొంచెం వివరించే ఉద్దేశంతో. కొంచెం ఆసక్తిగా వానిపై శ్రద్ధ చూపింది నా భార్య. పిల్లాడు కాసేపు ఏదో ఆలోచించినట్టు నిలబడిపోయి వెంటనే-

'నేను జార్జిబుష్‌నౌతా' అన్నాడు

గొల్లున నవ్విందామె. నేను షాకయ్యాను.

నవ్వుతూ నవ్వుతూ-"మరి నీకు బిన్ లాడెన్ కావాలి గదరా" అందామె.

'డాడీ ఉన్నాడుగా' అంటూ అమ్మ వెనక్కి వెళ్లాడు.

ఆమె మళ్లీ బిగ్గరగా నవ్వింది.

ఆమెకు కావాల్సిన సమాధానమొచ్చిందేమో!

నా కడుపులో అడవులు తగులబడ్డటుంది-

కాదు, సంబంధాలు ప్రేమలు తగులబడుతున్నాయి. సమస్త చదువులు, కులవృత్తులు అందులో రాలిపడుతున్నాయి.

●